క్లుప్తంగా

బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి

ములకలపల్లి: రైతులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసేసమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, బిల్లులో పూర్తివివరాలు నమోదు చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ అబ్జల్‌బేగం తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. విత్తనాలను గుర్తింపుపొందిన లైసెన్స్ షాపుల్లో మాత్రమే ఖరీదు చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే, వాటిని కొనవద్దని, వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. తొలుత సేంద్రియ కర్బనం పెంపొందించడం, విత్తనాలు, ఎరువుల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు వివరించారు. జీలుగు, జనుము విత్తనాలకు రైతులకు అందజేశారు. ఎంఎఓ కరుణామయి, డివిజన్ ఎంఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

మండలంలో వర్షం

అన్నపురెడ్డిపల్లి: మండలంలో బలమైన గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం మంగళవారం కురిసింది. గాలి వానకు మామిడి కాయలు నేల రాలాయి. చెట్లు విరిగి పడిపోయాయి. రాజాపురం గ్రామంలో గాలిదుమారానికి ఇంటి ముందు రేకులు లేచిపోయాయి. వర్షంతో మండలంలో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్నటంతో పాటు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

గిరిజనుల వినతి

చర్ల: మండలంలోని పులిగుండాల గ్రామపంచాయితీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ పులిగుండాల గిరిజనులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయించాలని, తాగునీరు, సాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

బకాయిలు చెల్లించాలి

మణుగూరుటౌన్: పీకేఓసీ వాషింగ్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాల్సిన సెంట్రల్ జీవో వేతన బకాయిల చెల్లింపునకు సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పర్సనల్ మేనేజర్ సింగు శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడారు. కార్యక్రమంలో వేల్పుల సామేలు, పొడుతూరి ప్రసాద్, రెబ్బలపల్లి వెంకటాచారి, వేరుపుల నాగేశ్వరరావు, గుగులోత్ కస్నా, మంచాల మహర్షి, గుగులోత్ కల్యాణ్, కోయిల రాజు తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధి ఎన్టీఆర్ గ్రామంలో ఇటీవల మరణించిన అంగన్‌వాడీ టీచర్ వంక నాగమణి భర్త రఘునాథ్ దశదినకర్మలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు హాజరై రఘునాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మడి వీరన్నబాబు, ఉప్పుతల రామారావు, బర్ల సురేష్, వెంకన్న, సూరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

చండ్రుగొండ: కాంగ్రెస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యండి.సాబీర్‌హుసేన్ (65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వైద్యచికిత్స నిమిత్తం ఆయనను హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సాబీర్‌హుసేన్ భౌతికకాయాన్ని సందర్శించిన వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. మృతదేహంపై కాంగ్రెస్‌పార్టీ జెండా కప్పి పార్టీ నాయకులు నివాళులర్పించారు.

బీసీ హాస్టల్ కుక్..

అశ్వాపురం: మండల కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహంలో వంట కుక్‌గా విధులు నిర్వర్తిస్తున్న చీమల రమేష్(44) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా అనార్యోగంతో బాధపడుతున్న రమేష్ ఖమ్మంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించి తన స్వగ్రామం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలోని నివాసంలో మృతి చెందాడు. రమేష్ మృతదేహానికి వార్డెన్ నరసింహారావు నివాళులు అర్పించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశాడు.

కనీస వేతనం ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: ఉపాధి పని చేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.600 లు వేతనంగా ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ స్థాయి జనరల్ బాడీ సమావేశం మంగళవారం సావిత్రి అధ్యక్షతన చందర్‌రావు భవన్‌లో జరిగింది. సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్మిక నాయకుడు గడ్డం స్వామి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా 'దారి' లేదాయే..!

- గిరిజనులను వేధిస్తున్న రహదారి సమస్య
- నిధులు మంజూరైనా.. అనుమతులు లేవు..
- సర్వేలకే పరిమితమైన అధికారులు



వెంకటాపురం-మామిళ్లవాయి రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన వెంకటాపురం గ్రామ పంచాయతీలోని మామిళ్లవాయి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఎన్నో ఏళ్లుగా అష్టకష్టాలు పడుతున్నారు. రహదారి సౌకర్యం గిరిజనులు కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడుతున్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. గత ఐదు ఏండ్ల క్రితం రహదారికి నిధులు మంజూరయ్యాయి. రహదారి కల నెరవేరుతుందని గిరిజనులు ఆశగా ఎదురుచూశారు. గిరిజనుల రహదారి కల నెరవేరేలా లేదు.

అటవీశాఖ అనుమతులు లేక..

ఐదేళ్ల క్రితం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పూర్తయ్యాక అటవీ శాఖ అభ్యంతరంతో రహదారి పనులు ఆగిపోయాయి. వెంకటాపురం–మామిళ్లవాయి రహదారికి గత మూడు ఏండ్ల క్రితం 4.350 కి.మీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. డీపీఆర్, టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉండగా అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రహదారి పనులు ప్రారంభం కాలేదు. రహదారి 900 మీటర్లు మినహా 3.250 కిలోమీటర్లు వెల్ట్‌లైఫ్, రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉండటంతో కేంద్రం అనుమతులు కావాల్సి ఉండటంతో అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. జీపీఎస్ సర్వే చేపట్టి కేంద్రానికి నివేదిక పంపారు. కేంద్ర అటవీ పర్యావరణ వన్యప్రాణి సంరక్షణ శాఖల అధికారుల బృందం రహదారిని పరిశీలించి వెల్ట్‌లైఫ్, ఫారెస్ట్ భూమి రహదారి నిర్మాణంలో ఎంత ఉందో తెలుసుకుని స్థానిక అధికారులతో మాట్లాడారు. స్థానికులు కేంద్ర అధికారుల బృందం అధికారులతో మాట్లాడి రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సకాలంలో వైద్యం అందక గర్భిణీలు రోగులు అవస్థలు పడుతున్నారని రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని రహదారి నిర్మాణానికి అనుమతులకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఏళ్లు గడుస్తున్నా రహదారి నిర్మాణానికి అనుమతులు రావడం లేదు. రహదారికి మోక్షం కలగడం లేదు. దీంతో ఎన్నో ఏండ్లుగా రహదారి సౌకర్యం లేని మామిళ్లవాయి గ్రామానికి ఇప్పటికైనా రహదారి కష్టాలు తీరుతాయా అని గిరిజనులు ఆశగా ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు రహదారి అనుమతులకు తగు చర్యలు తీసుకోవాలని రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు..



ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం. మొండికుంట, అశ్వాపురం వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఎవరికైనా అత్యవసరంగా వైద్యం అందాలంటే ఆస్పత్రులకు వెళ్లాలంటే ఆలస్యం అవుతోంది. వర్షాకాలంలో ఇంకా ఇబ్బంది.

– సోయం రమేష్, మామిళ్లవాయి

రహదారి నిర్మించాలి..



రహదారికి నిధులు వచ్చి సంవత్సరాలు గడిచిపోతోంది. నిధులు కూడా ఉన్నాయో లేదో. రహదారి లేక మా బాధలు చెప్పలేం. రహదారి నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మించాలి.

– తాటి సంపత్, మామిళ్లవాయి

ఎమ్మెల్సీగా రాకేష్‌ను గెలిపించాలి



భద్రాచలం: సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ పార్టీ బలపరుస్తున్న రాకేష్ రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కోరారు. మంగళవారం భద్రాచలంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. నిరుద్యోగుల పక్షాన పోరాడే మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కే ఉందని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, టీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి వెంకటరమణారెడ్డి, భద్రాచలం మండలం నాయకులు ఆకోజు సునీల్ కుమార్, దానియేలు ప్రదీప్, అయినాల రామకృష్ణ, ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ గ్రామంలో పట్టభద్రులను జెడ్పీటీసీ నరసింహారావు, బీఆర్‌ఎస్ నాయకులు కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్లకు న్యాయం జరగాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మడి వీరన్నబాబు, ఉప్పుతల రామారావు, బర్ల సురేష్, జడ్పట్ వెంకన్న, వంక సూరయ్య, గుగులోత్ హటియ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న గెలుపునకు పని చేయాలి



చర్ల: పట్టభద్రులను కలిసి తీర్మార్ మల్లన్నకు ఓటు వేయాలని కోరుతున్న నాయకులు

అశ్వాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్, మిత్రపక్షాలు బలపరుస్తున్న అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కమ్యూనిస్టులు, కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుగా ప్రజా సమస్యలు, పట్టభద్రుల సమస్యలు తెలిసిన మల్లన్న గెలుపు ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిస్తే వరుస విజయాలు ఖాయమన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజేష్, పవన్‌సాయి, వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం మంగళవారం చర్లలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవ్వాలంటే తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించి చట్టసభకు పంపించాలని ఈ సందర్భంగా నాయకులు పట్టభద్రులను కోరారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, తాండ్ర రాయుడు, పటేల్ వెంకటేశ్వరావు, బండి వేణు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: గత 20 ఏళ్లుగా వికలాగ్వంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన దివ్యాంగుడికి పలువురు ఆర్థిక సాయమందించారు. మండలంలోని పర్ణశాల గ్రామపంచాయతీకి చెందిన సోయం సత్యం-సావిత్రి దంపతుల కుమారుడు సోయం రాము పుట్టుకతో దివ్యాంగుడు. కాళ్లు చేతులతో పాటు శరీర అవయవాలు ఏమీ పనిచేయక మంచానికి పరిమితమైయ్యాడు. దీనికితోడు అనారోగ్యంతో 5 సంవత్సరాల క్రితం రాము తల్లి, ఏడాదిన్నర క్రితం తండ్రి మరణించారు. రాము బాగోగులు తన సోదరి సమ్మక్క చూస్తోంది. కొమరం భీమ్ క్రికెట్ టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ తెల్లం హరికృష్ణ ద్వారా రాము విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరి అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. టోర్నమెంట్‌లోని పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. ప్రకటించిన నగదును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. దండు సుబ్బరాజు రూ.10వేలు, కాపుల నాగరాజు రూ.5వేలు,కొమరం దామోదరరావు రూ.5వేలు, తెల్లం లక్ష్మీనారాయణ రూ.2వేలు, దేవరపల్లి క్రికెట్ టీం రూ.3వేలు, పెద్ద బండి రేవు క్రికెట్ టీం రూ.2వేలు, గోవిందాపురం కొమరం భీమ్ మేనేజ్‌మెంట్ రూ.4వేలు అందజేసి అదుకున్నారు. పలువురు దాతలు ముందుకొచ్చి తోచిన సాయం అందించి, రాము కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



దుమ్ముగూడెం: సోయం రాముకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళకు..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన గుర్రం జ్యోతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. మంగళవారం గ్రామంలో ఆమె నివాసంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమెను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీటీసీ బేతం రామకృష్ణ, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం సబ్ స్టేషన్‌లో పరిధిలో నేడు(బుధవారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. సబ్ స్టేషన్‌లో ఉన్న 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చే పనులు కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోగల గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మండపానికి శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి ఆలయం నిర్మాణ ప్రాంగణంలో ఉపాలయాల నిర్మాణంలో భాగంగా మంగళవారం నవగ్రహాల మండపానికి ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఆలయం చుట్టూ ప్రహరీ, తూర్పు ద్వారం, ఉత్తర ద్వారానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, స్థపతి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

బూర్గంపాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం సారపాక, తాళ్లగొమ్మూరు, కోయగూడెం గ్రామపంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలలో బ్యాలెట్ పేపర్‌లోని సీరియల్ నంబర్ 3లోని ఏనుగు రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జలగం జగదీష్, కొనకంచి శ్రీనివాస్, తుపాకుల రవి, చుక్కపల్లి బాలాజీ,బిట్ర సాయిబాబా, చలకోటి పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

చర్లరూరల్: చర్ల మండలం కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆదేశానుసారం వైద్య సిబ్బంది మంగళవారం కందిపాడు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 52 మందిని పరిశీలించిన వైద్యులు జ్వరంతో బాధపడుతున్న వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరి నుంచి రక్త నమూనాలను సేకరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆర్‌బీయస్‌కే వైద్యులు శిరీష, శ్యాంప్రసాద్, వైద్య సిబ్బంది వేణు గోపాల కృష్ణ, రాంప్రసాద్, ధర్మారావు, నరసింహారావు, స్వరూప, భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా సర్వే

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండి-సర్వాయిగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా సర్వే నిర్వహించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వీరిలో పలువురి నుంచి రక్తనమూనాలను సేకరించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమేష్, ఏవీ లక్ష్మి, ఇందిర, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీలు విక్రయిస్తే పీడీ యాక్టు



అశ్వారావుపేటరూరల్: డీలర్లతో మాట్లాడుతున్న సీఐ జితేందర్ రెడ్డి

అశ్వారావుపేటరూరల్: అన్నదాతలకు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే ఊపేక్షించేది లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మండలంలోని విత్తన, ఎరువుల డీలర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే రిజిస్టర్లలో సమగ్ర వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా రైతులకు అన్ని వివరాలతో కూడిన బిల్లులను అందించాలని, నకిలీ రకాలు విక్రయాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అదే విధంగా వీటిని డీలర్ల వద్ద కొనుగోలు చేసే రైతులు కుడా అప్రమత్తంగా ఉండాలని, పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సై శ్రీరాముల శ్రీను, విత్తనాల డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పురుగు మందులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో సీఐ అశోక్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నడిపినా, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతిరావు, డీలర్లు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో దుకాణాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు నకిలీ విత్తనాలను నిల్వ చేసినా.. విక్రయించినా.. రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించి, మోసం చేస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని, ఎంఆర్‌పీ రేట్లకంటే ఎక్కువకు అమ్మకూడదని అన్నారు. లేబుల్ లేని విత్తనాలను సరఫరా చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చండ్రుగొండ: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దార్ సంధ్యరాణి కోరారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 14 పంచాయితీల్లో 783 మంది ఓటర్లు ఉన్నారని, చండ్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



అయోధ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో శస్త్ర చికిత్సలు నిర్వహించగా.. మణుగూరులోని ఆదర్శ్‌నగర్‌లోని నివాసంలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, గుడిపూడి కోటేశ్వరరావు, పల్లపు తిరుమలేశ్, గాండ్ల సురేశ్, మధు, పెనుగొండ సాంబశివరావు తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ములకలపల్లి: ములకలపల్లి సొసైటీ ఆధ్వర్యంలో జీలుగు, జనుము విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయాధికారిణి కరుణామయి మంగళవారం ఓ ప్రకటనతో తెలిపారు. 30 కేజీల జీలుగు విత్తనాలు బస్తా రూ.1,116, 40 కేజీల జనుము విత్తనాలు బస్తా రూ.1,448 ధర ఉంటుదని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతుల తమ ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకాలతో మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్ర

బూర్గంపాడు: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. మండల పరిధిలోని చెరువు సింగారంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో పనిప్రాంతంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండల్లో మట్టి పనులు చేస్తున్న కూలీలకు కనీస వేతనం చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.100 వేతనం కూడా రావటం లేదన్నారు. కేంద్రం కుట్రలను కూలీలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉసిల్ల నరేష్, వీరమ్మ, మద్దెల కృష్ణ, యశోద, ప్రేమలలిత, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో మాజీ ఎమ్మెల్యే

దమ్మపేట: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ నెల 18 నుంచి దమ్మపేటలో జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఉయ్యాల వెంకటేశ్వరరావు, అబ్దుల్‌జిన్నా, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీను, యేసుబాబు, విశ్వేశ్వరరావు, లక్ష్మీనారాయణ, రాజు, ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, రమేష్, గోపి, సాయి, శశిధర్ పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లను రద్దు చేయాలి


భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో నకిలి ఆధారాలతో బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన వారిని గుర్తించి, వెంటనే వాటిని రద్దు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఆవరణలో మంగళవారం అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లు వెలుగు చూస్తున్నాయని, అధికారులు పూర్తిస్థాయి విచారణ జరపకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. శాప మహేష్, చింత జనార్దన్, వెంకటేశ్వర్లు, నరసింహ మూర్తి, రాజులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఆయా ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, ఇతర సెంటర్లలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజీవ్ అభిమానులు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని పేర్కొన్నారు. భారత దేశ అభివృద్ధిలో ముఖ్యంగా ఐటీ రంగంలో కీలకపాత్ర పోషించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే, నాయకులు



భద్రాచలంటౌన్: రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అశ్వాపురం: మొండికుంటలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ, నాయకులు